# క్షణికావేశం

రచన :
శ్రీ ఎ. బాలసుబ్రహ్మణ్యం

మాసిపోయిన గడ్డం, లోతుకు పీక్కుపోయి దీనంగా చూసేకళ్లు, తైల సంస్కార విహీనమైన చింపిరి జుత్తు, మాసికలై, పీలికలైన దుస్తులతో చూపరులకు జాలిగొలిపే వదనంతో ఆ వ్యక్తిని నేను చాలా రోజులనుండి అదే పేవ్‌మెంట్ మీద చూస్తున్నాను. ప్రతీ రోజూ ఆఫీసు కెళ్తూ అడుక్కొంటున్న అతన్ని జూచి, 'అతని జీవిత గాధ ఏమిటా' అని ఆలోచిస్తూండడమూ కద్దు.

ఆరోజు కూడా ఆఫీసుకెళ్తూ అతన్ని జూసేను. అతడు నన్ను పిలిచాడు. ''ఎందుకో'' అనుకొంటూ అతన్ని సమీపించాను. ''బాబూ! మొన్న మీరు, ఒకావిడ ఇలా ఎక్కడికో వెళ్తూంటే చూశాను. ఆవిడెవరో చెప్తారా?'' అని అడిగాడు.

నిజమే! మొన్న శనివారం నాడు మినర్వాలో ఏదో మంచి పిక్చరుందని తెలిసి నేను, భారతి కలసి వెళ్ళాం. అది వీడు చూసి వుంటాడు కామోసు! అయిన భారతి విషయం వీడికెందుకు?...

''ఆమె నా భార్య'' అన్నాను అతడితో. అతను ఉలిక్కిపడ్డాడు. అతని కళ్ళలో ఆదుర్దా ఆవేశం ప్రతిఫలిస్తున్నాయ్!

అతని ప్రవర్తన నాలో సంచేహానికి కారణమైంది. కొన్ని క్షణాల తర్వాత అతను మెల్లగా నిట్టూర్పు విడుస్తూ ''అది మిమ్మల్ని పట్టిందీ...'' అని గొణిగాడు.

నా నెత్తిమీద ఒక్కసారి పిడుగు పడ్డట్టయింది; ఏమిటీ వీడంటున్నది...?

''మీ కంతా చెప్తే గాని తెలియదు బాబూ!'' అన్నాడతడు మెల్లగా.

చుట్టూ చూశాను; అది పబ్లిక్ రోడ్. జనంతో, వచ్చీపోయే శకటాలతో రద్దీగా వుంది.

''అయితే ఆ హోటల్లోకి పద,'' అంటూ నేను ఎదురుగానున్న ఒక హోటల్లోకి దారి తీశాను. అతను సంశయిస్తూనే న్ననుసరించాడు. జనం అట్టే లేని ప్రదేశంచూసి నేను, అతను కూర్చొన్నాము. సర్వర్ రాగానే రెండు కాఫీలకు ఆర్డరిస్తూ, ''ఇప్పుడు చెప్పవోయ్, నీ కథేమిటో'' అన్నాను.

అతను కాఫీ త్రాగి, ఇలా చెప్పడం మొదలెట్టాడు. ''నాపేరు రత్తయ్య. నాచిన్న తనములోనే తల్లి తండ్రులు మరణించారు. అప్పటికి నాకు పదేళ్లు. ఒక కుగ్రామంలో వుంటూండేవాణ్ణి. ఒక ధనవంతుల ఇంట్లో నౌఖరిగా వుంటూ, కాలాన్ని గడిపే వాణ్ణి.

కొన్ని సంవత్సరాలు మళ్లాయ్. నేను పెద్దవాణ్ణయాను. అప్పటి వరకు నేను కూడబెట్టిన డబ్బు రెండువందల రూపాయిలు. దానితో మంచి పిల్లని చూసి పెళ్ళి చేసుకొందామనుకొన్నాను.

''నా ఊహలు ఫలించాయి. నేను కోరిన అమ్మాయి నాకు లభించింది. ఆమెపేరు లక్ష్మి. ఆమెను పెళ్ళాడ్డం నా అదృష్ట మనుకొన్నాను. కాని అదే నా పతనానికి హేతు వవుతుందను కోలేదు.''

"లక్ష్మి, నేను మొదట్లో అన్యోన్యంగా వుండేవాళ్ళం. కాని క్రమేపి లక్ష్మి నన్ను ద్వేషిస్తోందని నాకు తెలిసింది. నేను తెస్తూన్న కూలిడబ్బులు లక్ష్మి విలాసానికి సరిపడేవికావు. అది క్లబ్బుల్లో తిరుగుతూ, పేకాడుతూ విలాసంగా గడిపేది. వాటికి డబ్బుకోసమని నన్ను వేదిస్తూండేది. కాని దాని విలాసానికి కావలసిన డబ్బు నేనెక్కణ్ణుంచి తేగలను?

"ఒకరోజు నేను పనిముగించి ఇల్లు చేరే సరికి లోపల్నుంచి నవ్వులు వినిపించాయి; కిటికీలోంచి చూసేసరికి లక్ష్మి..."

"నా శరీరమంతా వొణకసాగింది. కోపంతో నేత్రాలరుణిమను దాల్చాయి. అడుగులు తడబడ్డాయి."

"ఆగండి!" అని గట్టిగా అరిచాను. నా అరుపుకి ఇళ్ళంతా ప్రతిధ్వనించింది. లక్ష్మి, ఆమె ప్రక్కనున్న యువకుడు తృళ్ళిపడ్డారు.

"నేను కోపంతో కంపిస్తూ లక్ష్మి దగ్గఱకు పోయి ఈ చెంపా, ఆ చెంపా వాయించాను. ఆ యువకుని కోసం చూసేసరికి, అక్కడుం టేగా? ఏనాడో చల్లగా జారుకొన్నాడు."

"ఎవడు?" అని క్రోధంగా ప్రశ్నించాను లక్ష్మిని. లక్ష్మి మాట్లాడలేదు.'ఎన్నాళ్ళ్నుంచి? ఈమారు వాడు కనిపించాడంటే చూడు ఏం చేస్తానో!" అని గట్టిగా మందలించి పడుకోడానికి పోయాను.

"మరునాడు లేచి చూసేసరికి లక్ష్మి ఇంట్లోలేదు. ఇళ్ళంతా వెదికాను. ఇరుగు పొరుగు వాళ్ళని కనుక్కొన్నాను. కాని లక్ష్మి ఆచూకి తెలియలేదు. అప్పట్నుంచీ పని మానేసి ఊరూరు తిరుగుతూ ఈ ఊరు చేరాను. మొన్న హఠాత్తుగా మీతో లక్ష్మిని చూసే సరికి..."

"ఆపు!" అని గట్టిగా అరిచాను. "ఆమె నా భార్య!"

"కాదు. డబ్బుకోసం మగాళ్ళని మోసగించే కులట!" బిచ్చగాడరిచాడు.

నా హృదయం కోపంతో కంపించింది. ఉద్రేకంతో నాసికనుండి వేడి నిట్టూర్పులొచ్చాయి. భారతి!...నా భార్య! (?)... లక్ష్మి!...అబ్బా!...

భారతితో పరిచయం మనస్సులో మెదిలింది. అబ్బ! ఎంత నంగనాచి? తన కాప్తులెవరూ లేన్నది. 'నిన్ను పెళ్లి చేసుకొంటా నంటే 'అంత కంటేనా' అని సంతోషాన్ని ప్రకటించింది. ఆమె వెనుక ఇంతగాథా? ఒక కులటనా నేను వివాహమాడింది?? ఇది బయటి ప్రపంచానికి తెలిస్తే నా పరువు ప్రతిష్ఠలకే తీరని మచ్చ!

వడిగా ఇంటికి నడిచాను. తలుపు గట్టిగా బాదేను. చిరునవ్వు మొఖంతో తలుపు తీసి "ఆఫీసు కెళ్లలేదా?" అని ప్రశ్నిస్తూన్న భారతిని కోపంగా చూసేను. ఆ నవ్వు వెనుక ఎంత కల్మషం? అబ్బా! నివురుగప్పిన నిప్పు!

'హుఁ!' అని హూంకరిస్తూ లోనికి నడిచాను. గబగబా నా గదినిచేరి డ్రాయరు సొరుగు తెరిచి, సైలెన్సర్ అమర్చబడిన రివాల్వర్‌ను పంట్లాం జేబులో పడవేశాను.

"భారతీ!" అని పిలిచాను క్రోధారుణ నేత్రాలతో.

"ఎందుకండీ?" అంటూ వచ్చింది భారతి. కాదు! నారీపిశాచి!!

"నువ్వెరవో చెప్పు! అబద్ధం చెప్పి నన్ను మోసంచేయలేవు. నీగురించి అంతా ఇప్పుడే తెలుసుకొన్నాను" అన్నాను గట్టిగా పంట్లాం జేబులోనుండి రివాల్వర్ తీసి ఆమె హృదయానికి గురిపెడ్తూ.

"ఏమిటండీ ఇది? ఎందుకివాళ నామీద మీకింత కోపంవచ్చింది?" అంది భారతి తడబడుతూ.

"హు! నీకేమీ తెలియదుకదూ!" అంటూ రివాల్వర్ ట్రిగ్గర్ నొక్క ప్రయత్నించాను.

నాకు తెలివొచ్చింది. ఎదురుగా భారతి తడబడుతూంది. ఏమిటినేను చేసిన పని? క్షణికావేశానికి లోనైనిండు ప్రాణాన్ని హరించ ప్రయత్నించాను గదా?...

భారతి నా వైపు చూసింది. దగ్గరకు రమ్మని సంజ్ఞ చేసింది. వెళ్ళాను. చేతిని టేబుల్ వైపు చూపుతూ వెళ్ళమని సంజ్ఞ చేసింది.

టేబుల్ వైపు నడిచాను. దానిమీద నున్న తెల్లటి కవరు నా దృష్టి నాకర్షించింది. ఆ తెల్లటి కవరుని తీసి చూశాను. 'కె. భారతి, C/O కె. రామకృష్ణ' అని నా అడ్రసుంది. కవరు చించేవుంది. దానిలోని కాగితాన్ని బయటికి తీసి చదివాను. అందులో ఇలావుంది.

"అక్కయ్యకు లక్ష్మి నమస్కరించి వ్రాయునది. అక్కా! ఏవిధంగానో కాని నేను చెడుత్రోవబట్టాను. నా నీచకృత్యం ఒకనాడాయన కళ్ళబడింది. నన్ను నానా విధాలుగా దూషించారు. నా కన్నులు నిజాన్ని గుర్తించాయి. నేను చేసిన నీచ కార్యాలకు ఫలంగా నా ప్రాణాలను త్యాగం చేస్తున్నాను. ఇవే నీకు నా ఆఖరి నమస్కృతులు.

అభాగ్యురాలైన
నీ చెల్లి,
లక్ష్మి."

"భారతీ!" గట్టిగా అరిచాను. ఎంత పని జరిగింది? లక్ష్మి, భారతి కవలపిల్లలయి వుండాలి. అందుకే ఆ ముష్టివాడు పాపం భారతిని లక్ష్మనుకొని పొరబడ్డాడు. ఒక నిమిష మేనా ఆలోచించకుండా వుంటే ఎంత ఘోరం జరిగేది. భగవాన్! నన్ను నువ్వు క్షమిస్తావా? అని ఒక నిట్టూర్పు విడిచాను.

లక్ష్మి నవ్వుతూ నా పాదాలపైబడింది.

---

ఇద్దరబ్బాయిలు దెబ్బలాడుకుంటున్నారు. ఓ పెద్దమనిషి ఓ పదినిమిషాలు చూసి, మొదటి అబ్బాయితో ఇలా అన్నాడు.

పె. మ:-అబ్బాయిలూ! ఎందుకలా దెబ్బలాడుకుంటారూ?

మొ. అ:-నీకోసమే?

పె. మ:-(ఆశ్చర్యంగా) నాకోసమా!

మొ. అ:-అవును...నీకోసమ్! వాడు నీకు గాడిదకున్న తెలివైనా లేదంటే; నేనుందన్నాను. అందుకే ఊ తగవు.

* * *

భీమసేను:-నాభార్య మనస్సు చాలా కఠినమైనది. వజ్రంలాగ...

క్రూరసేను:-దానికి పెద్దబాధేముంది? ఓ వజ్రంకొని ఇవ్వు. వజ్రం వజ్రేన భిన్నః లేదా!